వార్త, హైదరాబాద్, మంగళవారం, అక్టోబర్ 20, 2009

# హక్కుల ఉద్యమానికి కొత్త వారసత్వం

ప్రొ॥ జి హరగోపాల్

ఆధునిక మానవ హక్కుల ఉద్యమ చరిత్రలో, సిద్ధాంత పరిణామంలో, హక్కుల ఆచరణలో బాలగోపాల్ చిరస్థాయిగా నిలిచే ఒక సజీవమైన మలుపు. ముఖ్యంగా భారతదేశంలోని హక్కుల అవగాహనలో ఆయన చేసిన కృషి ప్రభావం హక్కుల ఉద్యమాలు ఉన్నంత కాలం ఉంటుంది.

హక్కుల చరిత్ర పాశ్చాత్య దేశాలలో 13వ శతాబ్దంలో భూస్వాములకు రాజ్యానికి మధ్య వచ్చిన తగాదాలో నుండి మ్యాగ్నా కార్టా పుట్టుకొచ్చింది. అంటే రాజ్యం తాను ఇష్టమొచ్చినట్లుగా నిరంకుశంగా పాలించడానికి వీల్లేదు అనే భావన మానవ చైతన్యంలోకి వచ్చింది. ఆ భావన మరింత బలపడడానికి ఫ్రెంచ్ విప్లవం, అమెరికా అంతర్యుద్ధం, యూరప్‌లో భిన్న దేశాల్లో విభిన్న రూపాల్లో వచ్చిన ఉద్యమాలు దోహదపడ్డాయి. స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం లాంటి ఉన్నతమైన విలువలు అభివృద్ధి చెందాయి. రూసో, థామస్ పేయిన్, జెఎస్ మిల్ లాంటి తత్వవేత్తలు వ్యక్తికి లేదా పౌరులకు మధ్య జరిగిన ఒప్పందంలో నుండి రాజ్యం వచ్చిందన్న సూత్రీకరణ చేసారు.

జెఎస్ మిల్ వ్యక్తి స్వేచ్ఛను ఆకాశపు హద్దులదాకా తీసుకెళ్ళాడు. మార్క్స్ ఈ మొత్తం చర్చను బూర్జువా వ్యవస్థ ఆవిర్భావ క్రమంలో వచ్చాయని, స్వేచ్ఛ సమానత్వ భావనలు ఉదాత్త భావనలైనా, నిత్యజీవితంలో నిజమైన స్వేచ్ఛ సమానత్వం లేనపుడు చట్టం దృష్ట్యా అందరూ సమానమే అనే భావన ఒక భ్రమా జనిత ఊహ (జ్యుడీషియల్ ఇల్యూజన్) అని అన్నాడు. అందుకే మార్క్సిస్టు ప్రేరణతో వచ్చిన ఉద్యమాలలో మానవ హక్కుల ప్రస్తావన చర్చ అంతగా ఉండదు. పందొమ్మిది, ఇరవైయవ శతాబ్దంలో జరిగిన స్వాతంత్ర పోరాటాలలో, ముఖ్యంగా మూడవ ప్రపంచం అని పిలువబడే దేశాల్లో మానవ హక్కుల భావన, ప్రధానంగా స్వేచ్ఛా స్వాతంత్ర భావనలు, పాశ్చాత్య ఉదారవాద సిద్ధాంతం వల్ల చాలా ప్రభావితమయ్యాయి. కాని అవి చాలా దేశాల్లో స్వాతంత్రం తర్వాత ఆచరణలోకి రాలేకపోయాయి.

## హక్కుల నేపథ్యం

భారతదేశంలో ప్రధాన స్రవంతిలో జరిగిన స్వాతంత్రోద్యమంలోగాంధీప్రభావం చాలాఉన్నా, గాంధీయిజం ప్రభావం లేదు. గాంధీ దృక్పథంలో హక్కుల కంటే బాధ్యతలు ముఖ్యం. అందరూ తమ తమ బాధ్యతలు సరిగా నిర్వర్తిస్తే, హక్కుల ఆవశ్యకత ఉండదని గాంధీ భావించాడు. కాని దీనికి భిన్నంగా రాజ్యాంగ పరిణామం మీద పాశ్చాత్య హక్కుల భావన ప్రభావం చాలా ఉంది. మన దేశంలో జలియన్ వాలాబాగ్ ఉదంతం తర్వాత హక్కుల ఉద్యమం నెహ్రూ నాయకత్వంలో ముందుకు వచ్చింది. 1930 వరకు బ్రిటన్‌లో ప్రజలకున్న హక్కులు భారతీయులకు కూడా కావాలన్న వాదన బలంగా ముందుకు రావడంతో, ఆ భావనే చాలా వరకు రాజ్యాంగంలో మూడవ అధికరణలో చేర్చబడింది. దీనికి భిన్నంగా 1930 ప్రాంతం నుండి దేశంలో బలపడుతున్న కార్మిక, కర్షక ఉద్యమాలు చాలా వరకు కమ్యూనిస్టు పార్టీల ప్రభావంలో ఉన్నాయి. మార్క్సిస్టు పార్టీలో సోవియెట్ విప్లవ స్ఫూర్తితో ఎదిగాయి. ఈ రెండు రాజకీయ పాయల బయట ఒకవైపు గిరిజన ఉద్యమాలు, మరోవైపు అంబేడ్కర్ ఆలోచనా స్రవంతి, దాని స్ఫూర్తితో ముందుకు వచ్చిన దళిత ఉద్యమాలున్నాయి. అంటే స్వాతంత్రోద్యమంలో మూడు నాల్గు పాయలు ప్రధానంగా ఇమిడి ఉన్నాయన్న చారిత్రక అవగాహనను గుర్తిస్తే, తర్వాత కాలంలో బాలగోపాల్ హక్కులను సిద్ధాంతీకరించిన పద్ధతిని, ప్రక్రియను అర్థం చేసుకోవచ్చు.

స్వాతంత్రం తర్వాత కమ్యూనిస్టు పార్టీలు పౌరహక్కుల స్ఫూర్తిని కొంత వరకు కొనసాగించినా అది పెద్ద ఎత్తున చర్చకు రాలేదు. అయితే రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత కూడా బ్రిటిష్ కాలంలో ప్రివెంటివ్ డిటెన్షన్ (పిడి యాక్ట్) క్రింద జైలులో ఉన్న ఎకె గోపాలన్ బయటకు రావడానికి కొంత సమయం పట్టింది. అంటే వలసవాద చట్టాలు స్వతంత్ర భారతంలో కూడా కొనసాగాయని, మన స్వాతంత్రం సంపూర్ణ స్వాతంత్రం కాదని గుర్తించాలి. అయితే పౌరహక్కుల భావన పెద్ద ఎత్తున ప్రారంభం కావడానికి ప్రధాన స్ఫూర్తి నక్సల్బరి ఉద్యమం. ఈ కారణం వల్లే ఇప్పటికి కూడా పౌరహక్కుల ఉద్యమాన్ని నక్సలైట్ ఉద్యమంతో జత చేసి చూడటమేకాక ఇది వాళ్ళ సంఘాలలో ఒక సంఘంగా ప్రచారం జరిగి, ఉద్యమాల్లో పోలీసు అధికారిని ఎవరినైనా చంపితే దానికి ప్రతీకారంగా పౌరహక్కుల నాయకుణ్ణి చంపేదాకా పోయింది. ఈ క్రమంలో పౌరహక్కుల ఉద్యమానికి విప్లవ పోరాటాలకు మధ్య ఉండే సంబంధాలేమిటన్నది ప్రశ్నార్థకంగా తయారైంది. ఈ సంబంధం గురించి మీడియా, మధ్యతరగతి మేధావులు, రాజకీయ పార్టీలు, అంతకుమించి పోలీసులు గుచ్చిగుచ్చి ప్రశ్నలు అడగడం ప్రారంభించారు. ఒకవైపు పౌరహక్కుల ఉద్యమం విప్లవ ఉద్యమాల పట్ల సానుభూతి కలిగున్నా, హక్కుల ఉద్యమం నిలబడ్డ నేలలో రాజ్యాంగ హక్కులు, మానవ హక్కులు, దాంట్లో భాగంగానే పోరాడే హక్కులు ప్రధానం. రాజ్యాంగాన్ని ప్రశ్నించిన వాళ్ళకు కూడా రాజ్యాంగంలోని హక్కులు ఉంటాయా అని న్యాయస్థానాలే అడిగేదాక మరొక ధోరణి వెళ్లింది. ఈ ప్రశ్నలకు సమాధానాలు, పరిష్కారాలు వెతికే క్రమంలో కూడా బాలగోపాల్ కొత్త ప్రతిపాదనలు, సూత్రీకరణలు చేయ ప్రారంభించాడు.

## భిన్న ధోరణులు

సమకాలీన సామాజిక మార్పుకు జరిగే ఉద్యమాలు, స్వాతంత్రోద్యమంలో లాగానే భిన్న ప్రాంతాల్లో చాలా సందర్భాల్లో సమాంతరంగా సాగుతూ వచ్చాయి. విప్లవ ఉద్యమాలలో కూడా భిన్న ధోరణులు, దృక్పథాలు ముందుకు వచ్చాయి. పౌరహక్కుల సంఘం చాలా ఒత్తిడులకు గురికావడం మొదలైంది. విప్లవ ఉద్యమంలో అంతర్గతంగా భిన్న ప్రాంతాల మధ్య సహకారానికి బదులు ఘర్షణ ప్రారంభం కావడంతో, ఆ ఘర్షణ ప్రభావం హక్కుల ఉద్యమం మీద కూడా పడింది. ఈ ఘర్షణను ఎదుర్కొనే క్రమంలో కొత్త అవగాహన, అవగాహనకు అనుగుణంగా సూత్రీకరణ అవసరమయ్యాయి. అంటే సమాజంలో జరుగుతున్న భిన్న ఉద్యమాలు దళిత, బహుజన, మహిళ, గిరిజన, అలాగే విప్లవోద్యమాలలోని భిన్న ఉద్యమాల మధ్య పౌరహక్కుల ఉద్యమానికి కొత్త నిర్వచనం అవసరమైనది. ఈ ఘర్షణ నుండి బయటపడే అవసరమేర్పడడంతో పౌరహక్కుల కార్యకర్తలు విభిన్న ఉద్యమాలకు తమ తమ అవగాహన మేరకు సానుభూతిని కలిగి, ఆ దృక్పథాన్నే బలంగా హక్కుల ఉద్యమంలోకి తీసుకురావడానికి లేదా దానికి మద్దతు సమీకరించడానికి ప్రయత్నించారు. మాలాంటి వాళ్ళ మంతా ఈ ఆటు పోటులకు గురౌతున్న క్రమంలో, బాలగోపాల్ పౌరహక్కులకు తనదంటూ ఒక దృక్పథం ఉండాలని, ఆ దృక్పథం అన్ని ఉద్యమాల సామాజిక ప్రయోజనాన్ని అంగీకరిస్తూ సమాజం ముందుకు పోవడానికి తన వంతు పాత్రను నిర్వహించడానికి ఒక స్వతంత్ర కార్యక్షేత్రాన్ని ఎన్నుకోవాలని ప్రతిపాదించాడు. ఈ అన్వేషణలోనే తన ప్రాపంచిక దృక్పథాన్ని కూడా విస్తరిస్తూ వచ్చాడు.

బాలగోపాల్ తాత్వికపునాదులను స్పృశిస్తూ ఒక విశాలమైన మైదానంలో నిలబడి ప్రపంచాన్ని చూసాడు. మానవ చరిత్ర ఆవిర్భావం నుండి మనిషి దేనికొరకు వెతుకుతున్నాడు అని శోధించాడు. జీవితానికి అర్థమేమిటని మానవజీవిత లోతుల్లోకి, దాని రూపాన్ని, సారాన్ని అర్థం చేసుకోవడానికి మథనపడ్డాడు. అందుకే సాహిత్యంమీద ఆయనచేసిన వ్యాఖ్యానంలో సాహిత్యం మానవజీవితంలోని ఖాళీలను పూర్తి చేయాలన్నాడు. అంటే జీవితానికి అంతిమంగా ఒక సమగ్రమైన, పరిపూర్ణమైన అర్థాన్ని ఇవ్వగలగాలి అని భావించాడు. ఈ అన్వేషణకు, ఆచరణకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అవసరమని భావించి, పౌరప్రజాస్వామ్య హక్కుల ఉద్యమంలో అవిరళంగా కృషి చేసాడు. ఈ కృషిలో నిరంతరంగా తాను కొన్ని ప్రశ్నలకు తన అసాధారణమైన మేధస్సుతోనే ఒకఅద్భుత ఆచరణలో జవాబులు వెతుకుతూవచ్చాడు. అందుకే ఆయన ప్రయోగంలో సార్వజనీన సూత్రాల ఆవిష్కార ప్రయత్నం జరిగింది.

పౌరహక్కుల ఉద్యమానికి ఆయన ఈ ప్రయోగం నుండి ఒక కొత్త అవగాహనను చర్చకు పెట్టాడు. ఈ చర్చలో ఆయన ప్రతిపాదించిన ప్రధాన అంశం, పౌరహక్కుల ఉద్యమం స్వతంత్రంగా తన చుట్టూ ఉన్న అన్ని ఉద్యమాలలో అంతర్లీనంగాగల నైతిక విలువలు ఏమిటి, ఆ విలువలని గౌరవిస్తూ అన్ని ఉద్యమాలలోని విలువల సార్వజనీనతను గ్రహించి ఆ విలువలను ముందుకు తీసుకుపోతూ, వాటి వ్యవస్థీకరణ కొరకు ప్రయత్నాలు ప్రయోగాలు చేయాలని ప్రతిపాదించాడు. ఇలాంటి కార్యక్షేత్రం ఎన్నుకుంటే ఏ ఒక్క ఉద్యమానికి కట్టుబడి ఉండకుండా, ఆ ఉద్యమాన్ని గౌరవిస్తూ, ఆ ఉద్యమ ఆకాంక్షలను, ఇతర ఉద్యమాల ఆకాంక్షలతో జత చేస్తూ అటు ఉద్యమాలకు ఉపయోగకరంగా ఉంటూ, ఈ విలువలను ఉద్యమ పరిధిలో ఇంకా రానటువంటి మిగతా సమాజాన్ని చైతన్యీకరించాలని, అదే పౌరహక్కుల కీలకమైన పాత్రగా నిర్వచించుకోవాలని చాలా బలంగా వాదించాడు. అవసరమైతే ఆయా ఉద్యమాలను వాళ్ళ విలువల ప్రమాణంతోనే ప్రశ్నించాలని, ప్రశ్నిస్తే వాళ్ళ ఆచరణ మెరుగుపడడానికి దోహదపడుతుందని భావించాడు. అలా విలువలు, ప్రమాణాలు ఉద్యమాలకు లేకపోతే ఉద్యమ కార్యకర్తలు అరాచకంగా ప్రవర్తిస్తే దానికి అడ్డు ఉండదని భావించాడు. విలువల ప్రమాణాలే కార్యకర్తల ప్రవర్తనను ప్రజలకు మరింత బాధ్యతవహించేదిగా మారుస్తుందని ఆయన బలంగా విశ్వసించాడు. ఈ అవగాహన, ఆచరణ సాధ్యాసాధ్యాలను పరీక్షిస్తూ ఆచరణని ఈ పరీక్షకు పెట్టాడు. ఇది నా దృష్టిలో బాలగోపాల్ భారతదేశ ప్రజాస్వామ్య ఉద్యమానికి ముఖ్యంగా మానవ హక్కుల ఉద్యమానికి అందించిన కొత్త వారసత్వం.

## స్వీయ ఆచరణ

బాలగోపాల్‌లో వచ్చిన ఈ మార్పు నిరంతర ఘర్షణలో నుండి వచ్చింది. అయితే ఆయన మిగతా చాలా మంది నాయకులు, కార్యకర్తలకంటే భిన్నంగా ఉండడానికి ప్రధాన కారణం ఆయన ప్రతిపాదించిన ప్రతి సూత్రాన్ని తన జీవితానికి, తన ఆచరణకు అన్వయించుకొనడానికి తనతో తాను పోరాటంచేసాడు. ఎంత పోరాటంచేసాడంటే ఆ విలువలన్నింటిని తన సహజప్రవర్తనలో భాగం చేసుకున్నాడు. ఎంత సహజంగా ఆచరించాడంటే వీటిని పాటించడం ఏమంత కష్టంకాదుఅని అందరూ ఫీల్ అయ్యేలా ప్రవర్తించాడు.

వీటన్నింటికి మించి, లేదా ఈ మొత్తం ప్రయోగానికి ఆయన సున్నిత మనస్తత్వం అద్భుతంగా దోహదపడింది. చిన్నపిల్లవాడుగా చీమను చంపకూడదు అని వాదించేవాడట. చీమను జిల్ల పురుగులను సున్నితంగా ఒక కాగితం మీద తీసుకువెళ్ళి బయటకు చేర్చేవాడట. చీమ మనను కుడుతుంది కదా అంటే, కుడితే మనకు బాధవుతుందని దానికి తెలియదు అని అనేవాడట. ఈ సున్నితత్వమే ఆయనను ప్రజలను, ముఖ్యంగా పేద ప్రజలను ప్రేమించే మనిషిగా తీర్చిదిద్దింది. ఆయన మనుషులను ఎంత ప్రేమించాడో, ఆయనకు చాలా సన్నిహితంగా ఉన్న వాళ్ళకే తెలుసు. మనిషి ముభావంగా ఉండేవాడు. ఎవరిని పలకరించేవాడు కాదు. తాను వచ్చిన పని అవుతూనే మౌనంగా వెళ్ళిపోయేవాడు. అత్యవసరం అనుకుంటే మాత్రమే మాట్లాడేవాడు. టెలిఫోన్ చేస్తే ఒక అరనిముషం, నిముషం మాట్లాడేవాడు. పోస్టుకార్డు వ్రాస్తే నాలుగు ఐదు వాక్యాలు మాత్రమే ఉండేవి. కాని హృదయం నిండా ప్రేమ, కళ్ళనిండా నీళ్ళున్నమనిషి. ఎవరికైనా బాధకలిగితే, జబ్బువస్తే తప్పక వెళ్ళేవాడు పలకరించేవాడు. దగ్గర కూర్చొని విశ్వాసమిచ్చేవాడు. పౌరహక్కుల నేత ప్రభాకర్‌రెడ్డిని వరంగల్‌లో పోలీసులు చంపిన తర్వాత ఆయన శవంమీద పడి చిన్న పిల్లవాడిలా ఏడ్చాడు. మనం పెరిగిన వాతావరణం వలన సామాజిక దుష్పరిణామాల వలన మనుషులు ఈ సున్నితత్వాన్ని కోల్పోయారు. అందుకే సున్నిత మానవీయ మనస్తత్వం, విశాల అవగాహన, జీవితంపట్ల లోతైన అన్వేషణ, అన్నిటికి మించి కఠోర ఆచరణ ఆయన అద్భుత ప్రజాస్వామిక ప్రయోగంలో అంతర్భాగం. ఈ ప్రయోగసారము మానవాళి మరింత మానవీయంగా మారే పరిణామ క్రమంలో తప్పకుండా అంతర్లీనంగా సజీవంగా ఉంటుంది. ❑